# పిచ్చి తల్లి

అగస్త్యప్రగడ హేమంత



(గత సంచిక తరువాయి)

"మీరెప్పుడొచ్చారు?" అతనికి దగ్గరగా వెళుతూ ఆశ్చర్యంగా అడిగింది.

"ఓ గంటయింది" చెప్పాడతను.

"అయితే మీరు బెంగుళూర్ కాన్ఫరెన్స్‌కి వెళ్ళలేదా?" ప్రశ్నించింది.

అది విని గాఢంగా నిట్టూర్చాడతను. "లేదు" చెప్పాడు.

"అసలు నేను ఇక్కడున్నట్లు మీకెలా తెలుసు?" ఆరా తీసింది.

అతను తలెత్తి కేశవరావు వైపు చూశాడో సారి. ఆ తర్వాత కుసుమ వైపు తిరిగాడు. "మీ పొలాలున్నది ఇక్కడేగా? అందుకే నువ్వు ఇంట్లో కనబడకపోయేసరికి ఇక్కడికే వచ్చుంటావని ఊహించాను" చెప్పాడు.

"సారీ ఇక్కడ కౌలు వాళ్ళు ఇబ్బందులు పెడుతున్నారని పి.వి. ఫోన్‌చేసి చెబితేనూ ఉన్నఫళంగా పరుగెత్తుకొచ్చేశాను. అప్పుడు మీరు ఢిల్లీ కాన్ఫరెన్స్‌లో ఉన్నారు. అందుకే మీకు తెలియపరచలేదు" సంజాయిషీ ఇచ్చింది కుసుమ.

మరోసారి గట్టిగా నిట్టూర్చాడతను. "నీ కోసం కారు తెచ్చాను. పద ఇంటికి వెళదాం" మెల్లిగా అన్నాడు.

అతని మాటలకి అదిరిపడిందామె. "అదేమిటి అలా అంటారు? ఇక్కడ నాకింకా చాలా పన్లున్నాయి. ఈ కౌలు వాళ్ళందర్నీ తీసి పారెయ్యాలి. కొత్తవాళ్ళని చూడాలి. వాళ్ళు మంచి వాళ్ళు అవునో కాదో నిర్ధారించుకోవాలి.

ఆ తర్వాత కౌలు పత్రాలు రాయించుకోవాలి. చాలా పనులున్నాయి. ఇవన్నీ ఒదిలేసి ఉన్న ఫళంగా రమ్మంటారేమిటి? నాకు కుదరదు. మీరు వెళ్ళండి. నేను తర్వాతొస్తాను" ఖచ్చితంగా చెప్పేసింది.

వింటున్న శ్రోతలు ముగ్గురూ మొహాలు చూసుకున్నారు. ఆ చూపుల్లో "ఇక విషయం దాచి ప్రయోజనం లేదు. నిజం చెప్పెయ్యడమే మంచిది" అన్న భావం. ఇంకోసారి దీర్ఘంగా నిట్టూర్చాడు ఆమె భర్త.

"కుసుమా! నువ్వు అనుకుంటున్నట్లు ఆ పొలాలు మీవి కావు. మీ నాన్నగారు బతికి లేరు. వాటన్నిటినీ ఆయన పదేళ్ళ క్రితమే మీ తమ్ముడి చదువు నిమిత్తం, మీ చెల్లెళ్ళ పెళ్ళిళ్ళ కోసం అందరికీ తలో కాస్తా అమ్మేశారు. ఆ నిజం గుర్తొచ్చిన ప్రతిసారీ నువ్విలా అప్‌సెట్ అవటం, ఆ షాక్‌లో ఇక్కడికి పరుగెత్తుకు రావడం, పొలాలూ, కౌలూ, శిస్తూ అంటూ వీళ్ళందర్నీ హడావిడి పెట్టడం, ఏమైనా బావుందా చెప్పు? నువ్వు నెలకీ రెండు నెలలకీ ఇలా ఇల్లొదిలి వచ్చేస్తే, వచ్చిన ప్రతిసారీ, నీ కోసం ఓ టాక్సీ తీసుకుని నిన్ను వెతుక్కుంటూ రావడానికి గుమాస్తాగాణ్ణి నా నెల జీతం ఏం సరిపోతుంది చెప్పు? ఇకనైనా నిజం గ్రహించి ఇంటికి పద" అనునయంగా చెప్పాడు.

వింటున్న కుసుమ స్థాణువైపోయింది. అతను చెప్పింది ఓ పట్టాన నమ్మశక్యం కాలేదామెకి. "ఇది నిజమా" అపనమ్మకంగా అక్షరం అక్షరం కూడబలుక్కుంటూ అడిగింది.

"నిజం" నిర్ధారించాడతను.

ఆమె తలపైన పది పిడుగులు ఒక్కసారే పడ్డాయి. కదిలిపోయింది. అంతవరకూ పదెకరాల కొబ్బరి తోటకి యజమానురాలినన్న ధీమాతో దర్పంగా ఉన్న ఆమె కాస్తా ఒక్కసారి కృంగిపోయింది. "అయిపోయింది అంతా అయిపోయింది" గొణుక్కుంటూ మొదలు నరికిన చెట్టులా ఉన్న చోటనే కుప్పకూలిపోయింది. అలాగే నాలుగు నిమిషాలు గడిచాయి. సరిగ్గా ఐదో నిమిషంలో ఓ చేదు నిజం జీర్ణమైనదానిలా తలెత్తి భర్త వైపు చూసింది. ఆ చూపుల్లో "ఇందాక మీరు చెప్పింది నిజంగా నిజమేనా?" అన్న ప్రశ్న.

ఆ భావం గ్రహించి "నిజం" అన్నట్లు తలూపాడతను. అతనికి తెలుసు ఆమె నిజాన్ని గ్రహించి, తమకేమీ లేదన్న వాస్తవం గుర్తించి, అక్కడి నుంచి కదలాలంటే అదే ప్రశ్నని వెళ్ళే లోపు మరో పదిసార్లు అడుగుతుందని ప్రస్తుతం జరిగిందదే.

అతని సమాధానంతో ఆమె హృదయంలోని ఓ అగ్నిపర్వతం బ్రద్దలయింది. కళ్ళల్లోంచి వేడి లావాలా కన్నీళ్ళు ఉప్పొంగాయి.

"అవి ఆ చెట్లని నేనే నాటాను. ఇంతింత మొక్కలుగా ఉన్నప్పుడు" మోచెయ్యి పరిమాణం చూపిస్తూ చెబుతుంటే ఆమె స్వరం గద్గదమైంది. "వాటికి తిండీ తిప్పలూ మాని నీళ్ళు పోశాను. ఆడదాన్ని అనైనా చూడకుండా వాటికి ఎరువుగా వెయ్యడం కోసం పేడ తట్టలు నెత్తిన పెట్టుకుని మోశాను. ఒక్కటి కాదు, రెండు కాదు, దాదాపు ఇరవయ్యేళ్ళు. బాల్యంలో ఊహ తెలిసిన క్షణం నుంచీ వాటికోసమే కష్టపడ్డాను. కౌమారాన్నీ, యౌవనాన్నీ ఆఖరికి నా రక్తమాంసాల్నీ కూడా వాటికోసమే ధారబోశాను. పదెకరాల ఎడారిలాంటి ఇసుక నేలని ఫలవృక్షాల మయంగా మార్చేశాను. ఇంత కష్టపడితే నాకు దక్కిందేమిటి? మా నాన్న ఈ పొలాన్ని అమ్మేసి నా చెల్లెళ్ళకి పెద్దపెద్ద ఆఫీసర్లని తెచ్చి పెళ్ళిళ్ళు చేశాడు. ఈ పొలాన్ని అమ్మేసి నా తమ్ముణ్ణి పెద్ద డాక్టర్ని చేశాడు. ఇవన్నీ నాకు తెలియకుండానే చేశాడు. కానీ వీళ్ళందరికంటే ముందు పుట్టి, ఇంత కష్టపడ్డ నన్ను మాత్రం ఓ మామూలు ఉద్యోగికిచ్చి కట్టబెట్టాడు. తోట కోసం ఇంత కష్టపడ్డానన్న కనీసపు కృతజ్ఞతయినా లేకుండా. అంతా తనే అమ్ముకున్నాడు తప్ప, నా కోసం ఒక్కటి, కనీసం ఒక్కటంటే ఒక్క కొబ్బరిచెట్టుని కూడా ఉంచలేకపోయాడు. మా నాన్న నా శ్రమంతా దోచుకున్నాడు. నాకు ద్రోహం చేశాడు. నన్ను మోసం చేశాడు" ఆవేశం కాస్తా ఆవేదనగా మారిపోయేసరికి ఇక తట్టుకోలేనట్టుగా వెక్కి వెక్కి ఏడ్చేసిందామె.

## వైజాగ్‌లో స్టూడియో!

ప్రముఖ నిర్మాత డి.రామానాయుడు వైజాగ్‌లో స్టూడియో నిర్మించబోతున్నట్లు టాలీవుడ్ బోగట్టా! హైదరాబాద్‌లో ఇప్పుడున్న స్టూడియోల కన్నా మెరుగ్గా ఉండేలా నిర్మిస్తున్నారట. ప్రకృతిరమణీయంగా ఉండే వైజాగ్‌లో నిత్యం షూటింగులు జరుగుతూ ఉంటాయి. తెలంగాణా రాష్ట్రం ఏర్పడుతుందన్న వాదన వినిపిస్తున్న సమయంలోనే కోస్తాంధ్రకు చెందిన రామానాయుడు వైజాగ్‌లో స్టూడియో నిర్మాణ పనులు చేపట్ట డం గమనార్హం.



## నోటిపూత తగ్గాలంటే!



ధనియాలు పొడిచేసి, ఒక గ్లాసు గోరు వెచ్చని నీటిలో రెండు స్పూనుల పొడిని కలిపి, నోట్లో పోసుకుని పుక్కిలించి ఉమ్మాలి. ఆ విధంగా రోజుకు 3, 4 సార్లు చేస్తే, నోటిపూత, పుండ్లు తగ్గుతాయి.

* పొటాషియం పర్మాంగనేటు వేసిన నీటిని పుక్కిలిస్తే కూడా నోట్లో పూత వెంటనే తగ్గుతుంది.

* పెద్ద ఉసిరికాయ పచ్చడిని నోట్లో పూత ఉన్నచోట, పుండ్లు ఉన్నచోట, వేలితో రాస్తే వెంటనే తగ్గుతాయి.

* కరక్కాయ పైన పెచ్చులను బుగ్గను పెట్టుకొని రసం మింగుతూ ఉన్నా నోటిలో పూత, పుండ్లు తగ్గుతాయి.

- గొల్లపూడి శ్రీనివాస్

నిజానికి కుసుమకి ద్రోహం చెయ్యాలని ఆ తండ్రి అనుకోలేదు. ఉన్నంతలో మంచి సంబంధం చూసి, ఆర్భాటంగా పెళ్ళి చెయ్యాలనుకున్నాడు. అందుకోసం అవసర మైతే ఓ ఎకరం పొలం అమ్మటానికి కూడా ఆయన వెనుదీయలేదు.


పెద్దాయన ఉద్దేశం మంచిదే అయినా అది కుసుమకి అసలు నచ్చలేదు. అవసరమైతే కన్నెగానైనా ఉండిపోవడానికి సిద్ధపడింది కానీ, తన పెళ్ళి కోసం పొలం అమ్మడానికి మాత్రం ఆమె అంగీకరించలేదు. అక్కడికీ తండ్రి ఆమెకి ఎన్నో విధాలుగా నచ్చచెప్పి చూశాడు. కానీ ఆమె విన్లేదు.

ఈ విధంగా కుసుమే తండ్రికి గడ్డు సమస్యగా పరిణమించేసరికి ఇక లాభం లేదని పైసా కట్నం కోరనివాణ్ణీ, రెండో పెళ్ళివాణ్ణీ వెతికి తెచ్చి కుసుమకి కట్టబెట్టి చేతులు తుడిచేసుకున్నాడు తండ్రి. ఆ తర్వాత ఆమెకి తెలియకుండా పొలాన్ని కాస్త కాస్తగా అమ్మేసి మిగతా బాధ్యతల్ని నిర్వర్తించుకున్నాడు.

కానీ ఇవేవీ కుసుమకి తెలియవు. కనుకనే భర్త సంపాదనతో తామిద్దరం బతకడం కష్టమౌతున్నా, ఒకే గదిలో అద్దెకి ఉంటూ ఆ జీవితాన్ని అనుభవించడం దుర్భరంగా ఉన్నా కేవలం తనకంటూ ఓ పొలం ఉందనీ, అది భవిష్యత్తులో తనని ఆదుకుంటుందనీ, ఇప్పుడు కష్టాలే అయినా తండ్రి తదనంతరం తనకి సంక్రమించబోయే పొలం ద్వారా రాబోయేవన్నీ సుఖాలేనన్న ఆశతో రోజులు గడపడం ప్రారంభించిన ఆమెకి తండ్రి పొలాలన్నీ ఏనాడో అమ్మేశాడన్న చేదు నిజం హఠాత్తుగా తెలిసింది. అప్పటికే ఆమె తండ్రి కాలధర్మం చెందాడు.

తండ్రి పోవడం ఒకదెబ్బ అయితే, తనకేమీ లేదని తెలియడం ఆమెకి మరో దెబ్బయింది. ఏ పొలం కోసమైతే తన సుఖాల్నీ సర్వస్వాన్నీ కాదనుకుందో, చివరికి ఆ పొలమే తనకి లేకుండా పోయేసరికి ఆమె మానసిక స్థితి తారుమారయింది. అంతే ఆ క్షణం నుంచీ తానో ఆఫీసర్‌కి భార్య అయినట్టూ, కార్లలో తిరుగుతున్నట్లూ ఏవేవో ఊహించుకుని మాట్లాడం, పొలం పొలమంటూ పిచ్చిగా ఈ ఊరికి పరుగెత్తుకు రావడం ఆమెకి అలవాటయిపోయింది.

## ఇప్పటికి తెలిసొచ్చింది!



కేవలం హావభావాలతో నెట్టుకు రావాలంటే కుదరదని హీరోయిన్ రిచాకి ఇప్పటికి తెలిసొచ్చినట్లుంది. ఇలాగే ఉంటే మాజీ హీరోయిననే ముద్రపడిపోతుందని భయం పట్టుకుందేమో, "పాత్రకు తగ్గట్టు నేను మాత్రం ఎందుకు చేయను? కానీ వచ్చిన పాత్రలన్నీ ఎక్స్‌పోజింగ్‌కు అవకాశం లేనివే!" అంటూ బాధపడిపోయింది. 'చాందినీబార్'లో టాబూ చేసిన క్యారెక్టర్ లాంటిది చేయాలనే కోరికుందట. రిచా ఎన్ని మాటలు చెప్పినా, నాలుగు అవకాశాలొచ్చినప్పుడు ఎక్స్‌పోజింగ్ చేయడానికి బెట్టు చేసిన సందర్భాలని గత నిర్మాతలు మాత్రం మరవడం లేదు.

అలా ఆమె వచ్చినప్పుడల్లా ఆమె పిచ్చి చేష్టల్ని భరిస్తూ కుసుమని ఆదరించడం, ఆ ఊరివాళ్ళకీ పరిపాటి అయింది. జరిగిందంతా గుర్తొచ్చేసరికి అక్కడున్న ముగ్గురి గుండెలూ నీరయిపోయాయి. అలా ఎంతసేపున్నారో వాళ్ళకి గుర్తు లేదు.

ఎక్కడో తొలికోడి కూసింది. అక్కడున్న ముగ్గురూ ఉలిక్కిపడ్డారు. ఆ నాలుగో వ్యక్తి మాత్రం అసలు ఈ లోకంలో లేనట్టు ఇంకా అలా ఏడుస్తూనే ఉంది. అందరికంటే ముందుగా తేరుకున్నది ఆమె భర్త. లేచి వెళ్ళి ఆమె తల మీద చెయ్యివేసి మెల్లగా నిమిరాడు. తలెత్తి భర్త ముఖంలోకి చూసిందామె.

"పద వెళదాం" మృదు వుగా అన్నాడు.


మారు మాట్లాడకుండా పైకి లేచింది. అతని ఆసరాతో ముందుకు కదిలింది. పదడుగులు వేశాక హఠాత్తుగా ఏదో స్ఫురించినట్టు రక్కున ఆగిపోయింది.


"ఏమిటీ?" అనునయంగా అడిగాడు.

"ఒక్కసారి ఒకే ఒక్కసారి పొలం చూసొస్తాను. ఇదే ఆఖరుసారి. ఇంక మళ్ళీ మళ్ళీ రాను" దీనంగా అర్థించింది.

అది అతనికి కొత్త కాదు ఆ అర్థింపులూ, వేడికోళ్ళూ. ఇదే ఆఖరుసారి అన్న మాటలూ, గత పదేళ్ళుగా, ఆమె ఈ ఊరికి వచ్చినప్పుడల్లా అతను ఆమెను తీసుకువెళుతున్నప్పుడల్లా వింటూనే ఉన్నాడు. ఈసారీ విన్నాడు. మామూలే అనుకున్నాడు. అందుకే మారు మాట్లాడకుండా ఆమె చెయ్యి పట్టుకుని పొలం వైపు నడిపించాడు.

సరిగ్గా అరగంట. ఇద్దరూ కొబ్బరితోటకి చేరుకున్నారు. అప్పుడప్పుడే తెల్లబడుతున్న తూర్పు దిక్కు కాంతిలో కనుచూపు మేరలో






కనిపిస్తున్న తోటని కళ్ళ నిండుగా చూసుకుందామె. దాన్నలా చూస్తుంటే కన్నబిడ్డల్ని చూసుకుంటున్నంత ఆనందం కలిగింది. హాయిగా నవ్వబోయేంతలో నిజం గుర్తొచ్చింది.

కడుపులోంచి కెరటాల్లా దుఃఖం తన్ను కొచ్చింది. వెక్కి వెక్కి ఏడ్చింది. ఏడుస్తూనే తోటలోకి పరుగెత్తింది. చెట్టు చెట్టునీ పట్టి పట్టి చూసింది. ఆప్యాయంగా తడిమింది. తనివి తీరా కౌగలించుకుంది. నేల మీద కూల బడింది. ఇసుకని దోసిళ్ళతో తీసుకుని ఎగ రేసింది. ఎగరేస్తూ నవ్వింది. పిచ్చిగా నవ్వింది. వెర్రిగా నవ్వింది. నవ్వుతూ నవ్వుతూ మళ్ళీ వెక్కి వెక్కి ఏడ్చింది. ఏడుస్తూనే ఉంది. ఇసుకని ఎగరేస్తూనే ఉంది. ఇసుక దోసిళ్ళతో భుజాల మీద, తల మీదా పోసుకుంటూనే ఉంది.

"ఒకప్పుడు ఇవన్నీ నావే. కానీ ఇప్పుడు కాదు నావి కాదు"

తనలో తాను గొణుక్కుంది. గొణుక్కుం టూనే వెర్రిగా అరిచింది. పిచ్చిగా పరుగులు తీసింది. పరుగెడుతూ ఆయాసంతో ఓ చోట కూలబడిపోయింది.

"ఇక చాలు కుసుమా రా" ఓపిగ్గా పిల్చాడతను.

తల తిప్పి చూసింది. దగ్గరగా వస్తూ కనిపించాడతను. భర్తలా కాదు, తనకి ప్రాణంలాంటి తోట నుంచి తనని వేరుచేసి దూరంగా తీసుకుపోయి, ఇల్లనే నరకంలో పడేసే యముడిలా. అతన్ని చూస్తుంటే ఆమెకి భయం వేసింది. అంతకు మించి తోటని విడిచి వెళ్ళడానికి మనసు విలవిల్లాడింది.

"రాను నేరాను. ఇక్కడే ఉంటాను" తెగేసి చెప్పేసింది. అయినా అతను ఆగలేదు. ఇక తను వెళ్ళడం అనివార్యమని ఆమెకి అర్థ మైంది. గబగబా దోసిళ్ళతో ఇసుకనెత్తి భుజాల మీంచి పోసుకుంది. నాలుగు దోసిళ్ళ ఇసుక కొంగులో మూట కట్టుకుంది. అప్పటికీ తనివితీరలేదు. అంతే దోసిలి నిండా ఇసుక తీసుకుని గబుక్కున నోటినిండా పోసుకుంది.

అసలే పొడి ఇసుక అటుపైన మెత్తటి ఇసుక. ఆ పైన అది నోటి నిండా నిండిపో యింది. దాన్ని కడుపునిండా మింగెయ్యాలన్నది ఆమె తాపత్రయం. లోపలికి వెళ్ళలేకపోవడం ఇసుక తాలుకు సహజ లక్షణం. వెరశి అది ఆమె గొంతులోనే అడ్డుపడిపోయింది. మింగ లేదు. కక్కలేదు. ఉక్కిరిబిక్కిరైంది.

ప్రమాదం గ్రహించి అతను ఆందోళనగా పరుగెత్తుకొచ్చాడు. ఆమె నోట్లో ఉన్న ఇసుక చేత్తో తీసేసి ఆమెకి ఊపిరి అందేలా చేయ డానికి విశ్వప్రయత్నం చేశాడు. విఫల మయ్యాడు. గిలగిలా తన్నుకుని తన్నుకుని ఆమె శరీరం నిర్జీవమైపోయింది.

ఆమె ఒంటినిండా ఇసుక. తలనిండా ఇసుక. ఆఖరికి క్షణం క్రితం ప్రాణం పోయినా ఇంకా వెచ్చగా ఆమె ఒంట్లో ప్రవహిస్తున్న రక్తంలో కూడా ఇసుక. ఏ తోటనైతే ప్రాణంలా పెంచుకుందో ఏ తోటకైతే ద్రోహం వల్ల దూరమైందో ఆ తోటలోనే ప్రాణాలు ఒదిలిందా పిచ్చితల్లి.

అంత ఘోరాన్ని చూడలేనట్టుగా తూర్పు దిక్కు ఎర్రబడింది. తోట మొత్తం ఆమె మరణానికి సంతాపం తెలుపుతున్నట్టుగా స్తబ్దమైంది. కడసారిగా తోటంతా కలయ జూసుకున్న కుసుమ ఆత్మ అనంత లోకాలకి పయనమైంది. ✵